స్కెచ్

అమ్మ

ఆర్. రామనాధరెడ్డి

రాత్రంతా కుంభవర్షం కురిసి వెలిసిపోయింది. దాంతో ప్రకృతిలో ప్రశాంతం వెలిసింది. ఉదయారుణ రేఖలు-చల్లదనంలో ముకుళించిన లేజిగుళ్లపై బంగారు మెరుగులు పెడుతున్నాయి. హృదయాలన్నీ చల్లబడినాయి.

అమ్మమాత్రం జలుబుచేసి బాధపడుతూ ఉంది. కాళ్లు వాతాన్ని లాగుతున్నాయి. అయినా లొంగింది కాదు అమ్మ. కాకులు కూసేముందు మేల్కొంది. ఇంటి పనులన్నీ చక్కబెట్టింది. అమ్మది చాల నిష్కృష్ట జీవితము. ఎప్పుడు విశ్రాంతి తెలియదు. మనుమలు కలిగిన నాటినుండి తనకి మరీ శ్రమలధికమయ్యేయి.

తెల్లవారకట్టే లేవడం—ఊరి వెలుపలి బావినుండి నీళ్ళు తేవడం...పాచి పనులన్నీ చేయడం, అంట్లు తోమడం, పాలుకాచి అన్నం వండడం...యింకా అవీ యివీ చిల్లర మల్లర పనులెన్నెన్నో అమ్మచేసేది.

అమ్మ కిద్దరు మనుమరాండ్రు—ముగ్గురు మనుమలూను. వంటపనులన్నీ ముగించి వీళ్లని లేపేది. ముఖాలు కడిగేది. కాసిన్ని రొట్టెముక్కలుచేసి వాళ్ళకు తినిపిస్తూ వాళ్ల ఆనందంలో తన కష్టాల్ని మరిచి పోయేది.

ఇంతవరకూ ఆమె చాల చురుగ్గా సంసారాన్ని యీదుకొచ్చింది. వంట యింటిలో యంత్రంలా అరిగి పోయింది. తన బ్రతుకులో యిక సుఖంలేదా అన్న తలంపు యింతవరకామెకు తట్టలేదు. కాని యీ ఉదయం—ఆమె ముఖకవళికలు మారిపోయేయి. నిరాశ, నిస్పృహాలు ఆమెలో దారి చేసుకుంటున్నాయి. పూర్వపు చులుకుదనం, ఉత్సుకతలు కనపడడంలేదు.

ఈ ఉదయం విసుక్కొంటూ లేచింది. "అబ్బ! నేను చచ్చే పర్యంతం యీ బాధలు నన్ను వదల వనుకుంటాను. వాడికేం!—యేమైనా చీమ కుట్టితే గదూ నా కష్టాలు తీర్చడానికి" అని గొణిగింది, ప్రక్క గదిలో పండుకున్న కొడుకు నుద్దేశించి.

అమ్మకు అందొచ్చిన కొడుకున్నాడు. తల్లిపడే కష్టాల వేపు అతని బుర్ర యెప్పుడూ మళ్లలేదు. ఆమె యింతవరకు విసుగు లేకుండా ఓర్పుతో చేయడం యింటో నౌకరును పెట్టుకోవాలనే భావం అతనిలో లేకుండా చేసింది. నౌకరును పెట్టుకోగల సత్తా ఉన్నా—అమ్మ బాగానే చేస్తున్నది. అదీగాక నౌకరందుకులే యీపాటి దానికి అని అమ్మ అంటుండేదని అనుకోవడంవల్ల కొడుకు ఊరుకున్నాడు.

ఇప్పుడే ఆమె అలా విసిగిందే గాని "నౌకరును పెట్టాలి, నేనిక పనులు చేయలేను," అని కొడుకుతో కచ్చింపుగా చెప్పనూలేదు. కోడలు సాయానికి వస్తే—"వద్దు తల్లీ నే చేసుకుంటాలే" అనడమే తెలిసిన పననుకొనేది. తర్వాత తన నిష్కృష్ట జీవితాన్ని నెమరుస్తూ నిట్టూర్చేది.

"అమ్మా!" అని పిలిచాడు కొడుకు. గుమ్మం అవతలనున్న అమ్మ వినిపించుకుని వస్తోంది. కదలడంలో వాతం చేసిన కాలు కలుక్కుమంది. మళ్ళీ సహించలేని బాధ కలిగింది. గొంటుతూవస్తూనే యిలా ఉద్దేశపడింది—"నే నికయీ పనులలో మ్రగ్గిపోలేను—నాకు బాగా విశ్రాంతి అవుసరము. పట్నంలో అమ్మాయి గారింటివద్ద రెండు మూడు వారాల పాటుంటే బాగుండేలావుంది"—

తన శ్రమ జీవితానుభవాలన్నీ ఒక్క సారిగా ఆమె బుర్రలో పరుగులెత్తి తన అభిప్రాయాన్ని బలపర్చినాయి. ఇక్కడ ఉండటంఅంటే యిక నరకంలా తోచింది. చివరకు కొడుకును నొప్పించి పయనమైంది.

* * *

బండి చకచకా నడిచి పట్టణంలో దింపింది అమ్మను. బండిలో ఉన్నంతసేపు నూత్న భావిజీవితంపై కలలుగంటూ

కన్పించింది. పట్టణం అంతా చాల క్రొత్తగా అగుపిస్తోంది. విశాలమైన తారురోడ్లు, నిత్యం యేదో పని మీద తిరుగుతున్నట్టుండే జనం, హడావుడి, బస్సు, కార్లు, అమ్మకి ఆశ్చర్యము పుట్టించాయి.

పట్నంలో జీవితం బాగానే ఉండొచ్చు—కాని డబ్బుండాలి—అనుకొంది. ఇంకా ఆమె యిలా అనుకొంది—ఇందాక యిచ్చిన బండికిరాయి పెడితే పల్లెటూళ్లలో రెండుదినాల భత్యంగడుస్తుంది.

నిజానికి బండికుదుపువల్ల కాళ్ళూ ఒళ్ళూ నొప్పిపట్టినా క్రొత్త జీవితంపైగల వ్యామోహం చాలవరకు నివారించింది. ఆనందంతో ఆమె హృదయం పరవళ్లు త్రొక్కుతోంది.

ఆమె బండిదిగి సరాసరి ఆ మండువా యింటి గేటు దగ్గరకు వెళ్లింది. వెళ్ళిందోలేదో ఓ బొచ్చుకుక్క బోంయ్ బోంయ్ మంటూ కరవొచ్చింది. అమ్మ కొంచెం తికమక లాడింది. ఆ కుక్క ప్రక్కనే ఓ చిన్న కుర్రాడు తప్పటడుగులు వేస్తున్నాడు. ఆమెను చూడ్డంతో "అమ్మేవ్—అమ్మేవ్—ముసలమ్మొచ్చిందే" అంటూ అరిచాడు.

ఇంతలో కూతురు గబాలునవచ్చి తల్లిని తీసుకు వెళ్లింది. "అమ్మా!—యింత నీరసంగా ఉన్నావే? ఎంత శ్రమ పడ్డావు! ఇక యిచ్చటనే ఉండి పోయి విశ్రాంతి తీసుకోమ్మా" అన్న కూతురు మాటలు తల్లినేత్రాల్లో జీవం పొదిగాయి.

ఆ రాత్రి కూతురు పరుపు మంచంపై పరుండమంది అమ్మని. ఆమెకిదే మొదటిసారి పరుపుపై పండుకోవడం.

తన కొడుకు యింటికాడైతే బయట వరండాపైనే మేలు వాల్చేది. వర్షాకాలం మాత్రం యింటిలో నట్టింటనే పరుండేది. ఇక అందరూ నిద్రపోయే వరకూ పనులే చేస్తూ అంతిమంగా తనే అలుపులుసూని నిద్రపోవడం జరిగేది.

ఇక్కడల్లా కాకుండా, తాను చేయవలసిన పనేలేదు. అంచేత అర్ధరాత్రివరకూ ఉండే అవసరంలేదు. భోజనాలు—వెంటనే పడక—యీ జీవితం అమ్మకు చాల వింతగా క్రొత్తగా అనుభవాని కొస్తోంది.

మర్నాడు ఐదన్నరగానే లేచింది అలవాటుప్రకారం. ఎవరూ చెప్పందే—కిచ్చెన్ లోకి పోయి—కూరగాయలు తరగడం ఆపనీ యీపనీ సాయం చేసింది నౌకరు పిల్లకి. మళ్ళీ ఆపై రెండుగంటలూ యేం చేయాలో తెలీలేదు అమ్మకు. నిజంగా ఆమె చేయాల్సిన పనిలేదు—చేయనీరు కూడ. ఆమె చేసే దల్లా తినడం తాగడం పిల్లల్ని కని పెట్టడం, కూతురితోను, అక్కడికి వస్తూపోయే వాళ్ళతోను పిచ్చాపాటీ చెప్పుకోవడము తప్పితే మరేమీ లేదు. వాళ్ళంతా తన కూతురుతో యేవేవో మాట్లాడే వారు. అవేమీ అమ్మకి అర్ధమయ్యేవి కావు. "మీ అమ్మకు క్లబ్బనగా, సినిమాలనగా, రేపనింగనగా యేమీ తెలీవులాగుంది" అనే వారు అమ్మ వింటుండగానే, చిన్న పిల్లలు కూడ. పట్టణం సంగతులు చెప్పుకుంటుంటే అమ్మ విస్తుపోతూ పరభాషిలా వింటుండేది. వాళ్ళను కని పెట్టడం వాళ్ళ మాటలు వింటూడంలో అమ్మకు దినాలు గడుస్తున్నాయి.

దాదాపు పదిరోజులయింది అమ్మ పట్టణంవచ్చి. అల్లుడు కూతురు ఆమెను అన్నివిధాల ఆదరిస్తున్నారు. ఓ నాడు కారు యెక్కించి పట్టణంఅంతా త్రిప్పి చూపించారు. మనుష్యులు యెక్కడంతోనే తుర్రుమని పోతున్నా కారును చూచి అమ్మ చాల ఆశ్చర్యపడింది.

మంచి మంచి చూడదగ్గ స్థలాలు, పెద్దపెద్ద షాపులూ, భవంతులూ, చూపించారు. ఓ రోజు సినీమాకు లాక్కెళ్లారు. అమ్మకివన్నీ క్రొత్తగా ఉండడంచాత సిగ్గుగా ప్రవర్తించేది.

ఆమె జీవితం యిలా పరివర్తనమౌతుందని యెప్పుడూ తలంచలేదు. ఆమె జీవితం యింత వైభవంగా గడుస్తున్నా యేగో వెలితిగా ఉన్నట్టున్నది. అంత ఆనందం లేదు. కొడుకుని మనుమల్ని విడిచివచ్చి అమ్మ యింతకాలం ఎప్పుడూ ఉండలేదు.

పట్టణం జీవితం ఆమెకంతగా రుచించలేదు, వాళ్లపై చెడ్డ అభిప్రాయం కలిగింది. వాళ్ల జీవితాలు చాల చెడ్డవని అనుకుంది. వాళ్ళు భగవంతుని కూడ ధ్యానించరు. చివరకు

తినేబియ్యం దాని పుట్టు పూర్వోత్తరాలు కూడ వాళ్ళకు తెలీవు. వరిమొక్కల గురించి వాళ్ళ కసలు తెలీదు.

ఇక్కడా మెకు పనీపాటాలేదు. మందమతిగా కూర్చుండడమే పని. ఇది ఆమెకు మరీ విచారం కలుగ చేసింది. ఆమె పనికిబాగా అలవాటయి పోయింది. ఆమె విశ్రాంతికి వచ్చినా పనిచేయాలనిపిస్తున్నది.

ఆమెవల్ల దమ్మిడీ కలిసిరాకపోయినా వాళ్లు భోజనం పెడుతున్నారు. పనేమీ చేయకుండా ఉచితంగా భోజనం తినేసి ఉండడం అమ్మకేమంత మనస్కరించ లేదు. ఆమె బుర్రలో అనేక తర్క వితర్కాలు చెలరేగు తున్నాయి. "ఉచితముగా తినేయడానికి నాకేం హక్కుంది—ఇతరుల కవుసరములేని మనిషికి విలువెక్కడ ఉంటుంది,—నా బ్రతుకు యితరులకు శ్రమే తప్ప ఉపయోగం లేదు." ఇలా ఆమె యిన్నిసార్లు అనుకుంది. ప్రతి దినమూ యిలాగే ఆలోచిస్తూ దినాలు గడుపుతోంది అమ్మ.

ఇంటికి వెళ్లివస్తానని యెప్పుడయినా అంటే కూతురూ అల్లుడూ బ్రతిమాలేవారు యింకాఉండమని. అమ్మ వాళ్ళను కాదనకలేక పోయేది. ఒకరోజు మధ్యాహ్నంమే—యధాప్రకారంగా పిల్లలిని కనిపెడుతూ వరాండాపై కూర్చుని ఆలోచిస్తున్నది. తన ప్రక్కనే కూర్చున్న కూతురు బజారు ఖర్చుల విషయములో నౌకరు పిల్లను చీవాట్లు పెడుతోంది మాటల్లో—అవకాశం చిక్కితే చాలు తినే సేయాలని చూస్తుంటారు అంది. ఈ మాట అమ్మకదోలా అయింది. హృదయం చలించింది. పూర్వం తాను పెత్తనం సాగించిన సంసార దినాలు జ్ఞాపకానికొస్తున్నాయి.

ఇదే సమయంలో ఆడుకొంటున్న పిల్లాడు చటుక్కున బోరలాపడ్డాడు. కూతురు అమ్మోయ్ అంటూ పిల్లాడిని ఎత్తుకుంది. పిల్లాడి నోటిలోని [illegible] రక్తం కారుతోంది. వాడు గోలపెట్టేస్తున్నాడు. అమ్మ ప్రాణం నిలువునా నీరై పోయింది. పంచదార కట్టుకట్టడాని కింట్లోకి వెళ్లింది. కూతురు ఐడిన్కు పరుగెత్తింది కాస్సేపటిలో యిద్దరూ వచ్చారు.

అదేమిటే అమ్మా అంది కూతురు. "ఇదమ్మా!—పంచదార—కట్టు కట్టితే రక్తం ఆగిపోతుంది" అంది ఆప్యాయంతో.

"అబ్బ!—యిల్లాటప్పుడు వెకిలిగా పనిచేయ గూడదమ్మా—పంచదారెందుకు తగలేయను-యిల్లాంటివి నీకేమీ తెలీవు"—

ఆ మాటలు చాల అవమానకరంగా తోచినాయి అమ్మకు. కొంచెం సిగ్గుపడింది.

"ఇలాంటి విషయాలు నీకేమీ తెలీవులాగుంది. యిలా వెకిలిగా పనులుచేయగూడదు" ఈ మాటలే పదేపదే అమ్మ బుర్రను కదిలించివేస్తున్నాయి.

ఆమె యిలా అనుకొంది, "ఆరడుగుల పిల్లల్ని చిన్నప్పటి నుంచీ పోషిస్తూ, కాపాడుతూవచ్చిన నాకా తెలీకపోవడం. నన్ను అవమానించడం—అబ్బ నాకేం సుఖం [illegible] వెళ్లిపోవాలి". అని తన నిర్ణయంవాళ్ళకు చెప్పి బయలుదేరింది.

* * *

బండిదిగి గేటుతీసి యింటిలో ప్రవేశించింది, అమ్మ సంతోషంగా. కాని అక్కడలాగు యే కుక్కా భౌంయ్ మంటూరాలేదు. ఏ కుర్రాడు ముసలమ్మొచ్చిందే అంటూ కేక వెయ్యలేదు.

ఇల్లు చాల నిశ్శబ్దంగా ఉంది. ఒక్కమాటేనా వినబడడంలేదు. వాళ్లుకూడ పట్టణం వెళ్లారేమోననుకుంది. లోనకు వెళ్ళింది—తన చిన్ని మనమరాలు లలిత మాట వినబడింది. చప్పుడువిని—"ఎవరది?" అంది లలిత. ఆ గది చాల చీకటిబారి ఉంది. అవతలివేపునుంచి కొద్ది వెలుతురు వస్తున్నది—అక్కడ నులక మంచంపై కోడలు పడుంది. ఆమె కొంచెం నీరసంగా [illegible]. అమ్మ రాగానే కోడలు తలపైకెత్తి చూసింది.

"ఓ అమ్మా!—వచ్చావా వచ్చావా!" అంటూ అంతులేని సంతోషంతో లేచివచ్చింది కోడలు. "అమ్మా! నీవు లేక పోవడం నిర్జీవంగా ఉంది యిల్లు.—మొదట లలి.

అమ్మ

తను అజీర్ణంపట్టుకుని చాల బాధపడి పోయింది. చూడు యెలా చిక్కి పోయిందో. జీవన్‌కి కూడా జ్వరం. ఇదిగో యిప్పుడే వెళ్లారలాగ నీళ్ళకి."

ఇంతలో జీవన్, సరోజిని నీళ్ళు తెచ్చారు. జీవన్ అమ్మని చూడ్డంతో ఆతృతగా వచ్చి చంకెక్కాడు— "అమ్మా! వచ్చావా!—నీవు లేక పోవడంయేమి బాగుండలేదే!—నీవు పోయిన తరువాత మనవి రెండు బిందెలు పోయినాయి అజాగ్రత్తవల్ల. పాదులన్నీ చెడి పోయేయి. మరి ఆవు పాలు సరిగా యివ్వడము లేదు" ఇలా యింకా యింకా చెప్పేస్తున్నాడు.

అమ్మ—తానులేక పోవడంవల్లకదా యింత అనర్థము వచ్చిందని అనుకుంది. ఉండునాన్నా—అబ్బ చాల పనుంది చేయాల్సింది. చూడు గదులెలాగున్నాయో, యీబూజులూ, దుమ్మూ—అంతా తుడువాలి, చేయాలి, పని చేయాలి— "ఊరికే కూర్చుంటే నే మందబుద్ధి" అని అమ్మమళ్ళీ సంసారాన్ని దిద్దింది.

నవ భారతి అవతరణ

శ్రీమతి డి. యస్. రాజేశ్వరీ పట్నాయక్

(లెండీ మన గాంధిని గొల్వండి అను
వరుసలో పాడవలెను)

లెండీ మన ప్రగతిని జాటండీ వేగలెండి
జండా లెత్తండీ 'జాయ్‌హింద'ని నిల్వండి ॥లెం॥

కాలామెటు మారెను గమనించు కోండి
బాపూ ఆత్మజ్యోతి ఆదర్శ మండీ ॥లెం॥

మన బాపు వారసుడౌ మన జవహారండి
శాంతి స్థాపన జేయ సహకారించండి ॥లెం॥

స్థిరచిత్తుడు మహాఘనుడు మనపటేలండి
ఉద్దండుడు మేధావి మనకండయండి ॥లెం॥

రణశంఖము పూరించెను మన సుభాషండి
జైహిందని గర్వంప ముందడు గేయండీ ॥లెం॥

ప్రజాభీష్ట పాలనము మన ప్రభుత్వమండి
నవ భారతి అవతరణ సుభదివసమిదండీ ॥లెం॥

★

FOR LOVELY LOOK & HEALTHY HAIR use KESRINE

PRICE AS 12 PER BOTTLE

VICTORIA DEPOT NORTH MADA ST. MYLAPORE, MADRAS

& AT MOST SHOPS

కేశ్‌రీన్ హేర్‌టానిక్ 0-12-0

కేశములు రాలుట మాన్పి సొగసుగాను, ఒత్తుగాను పుష్టిగాను, పెంపుచేయును.

కేశ్‌రీన్ షాంపూ పౌడరు 0-12-0

ఈ సువాసనగల పౌడరు వారమున కొకసారి కొంచెము నీటిలో కలుపుకుని తల స్నానమునకు యుపయోగించిన తలనుండు మురికి, జిడ్డు పోగొట్టును. జుట్టు నెదుగజేయుటలో సాయపడును.

పోస్టేజి ప్రత్యేకము 10 అణాలగును.

విక్టోరియా డిపో, మైలాపూరు, మద్రాసు 4.

ప్రఖ్యాతిగాంచిన ప్రశస్తమైన

మెహతావారి

విశేష ఔషధములు

1. సుందరి ఎలిగ్జిర్ :—సమస్త ఋతు దోషములను పోగొట్టును, గర్భాశయరోగ అనుపమ నివారిణి.
2. ఫాస్ఫరస్ ఆయిల్ :—బాధ నివారణకు సాటిలేని తైలము.
3. మస్తానాపిల్సు :—సాధారణజలుబునకు, కీళ్ళనొప్పులు జ్వరములన్నిటికి అమోఘముగా పనిచేయును.
4. ద్రాక్షాసవము :—(బంగారము, మకరధ్వజము కలిసినది) రక్తమును శుద్ధిపరచునటువంటి, అజీర్ణము రూపుమాపునటువంటి బలవర్ధకౌషధము.

కెమిస్టులందరివద్ద దొరకును.

తయారు చేయువారు:

K. S. MEHTA & CO.

250, China Bazar, Madras.